ఓం నమోభగవతే శ్రీరమణాయ, శ్రీ భారతీదేవ్యైనమః

ఉమాసహస్రము

(ఎనిమిదవ శతకము – చతుర్థ స్తబకము)

ద్వాత్రింశ స్తబకము

అవ:- ముప్పది రెండవది యగు నీ స్తబకమున యోగికిని – భక్తునకును గల భేదము నుపన్యసించి – అధ్యాత్మమగు హవన భేదములను నిరూపించు చున్నాఁడు.

మూ॥ విదధాతు సమ్పదం మే
సకల జగన్నాథ నయనహారిజ్యోత్స్నః।
శీతోఽన్ధకారహారీ
హాసశశీకశ్చిదఙ్క రహితోమాతుః॥ 1

సర్వలోకేశ్వరుఁడగు శివుని నయనముల నపహరించు వెన్నెల గలదియు, అంధకారమును పోఁగొట్టునదియు (అవిద్యను తొలఁగించునదియు) చల్లనిదియు, (తాపమును హరించునదియు) కలంకము (మచ్చ) లేనిదియు, నగు మాతయగు నుమాదేవి యొక్క హాసశశి (చంద్రుని వంటి నవ్వు) నాకు సంపదనిచ్చుఁగాత!

అవ:- 'హాసశశి' అనుచోట సంపదనిచ్చునది హాసమగుట వలన పూర్వపదము యొక్క అర్థము ప్రధానము. కావున నిది యుపమితసమాస మగుచున్నది. కళంకము లేని శశియనుట వలన వ్యతిరేకమలంకారమగును. మఱియు నిచట విషయియగు శశి – విషయభూతమగు హాస స్వరూపమున

భరిణమించుట వలననే సంపదనిచ్చుటయను ప్రకృతార్థమునందుపయోగించును. కావున నిది – పరిణామాలంకారము గూడ నగునని గ్రహించునది.

మూ॥ కరుణారసార్ద్రహృదయా
హృదయాన్తరనిర్యదచ్ఛ వీచిస్మేరా
ప్రమథేశ్వర ప్రియతమా
పాద ప్రేష్యస్య భవతుకల్యాణాయ ॥ 2

కరుణారసార్ద్రహృదయము హృదయములో నుండి వెలికివచ్చుచున్న స్వచ్ఛములగు తరంగములు గల చిరునవ్వు గలదియు, ప్రమథేశ్వరుఁడగు శివునకు ప్రియతమయు అగు పార్వతి – చరణకింకరునకు మంగళము నొసఁగుఁగాత

ప్రభ:- ఉత్తరంగితమగు దయారసము – హృదయాంతరము నుండి బయలు వెడలి, ముఖమునందు చిరునవ్వుగా విజృంభించుచున్నదని భావము.

మూ॥ కారణ కార్యవిభేదాత్
రూపద్వితయంత వామ్బయదృషి ప్రోక్తమ్।
తత్రైకం భర్తుమిదం
విహర్తు మన్యత్తు భూతభర్తుర్లలనే! 3

అమ్మా! కారణ – కార్య విభేదము వలన ద్రష్టలగు ఋషులచేఁ దెలుపఁబడిన రూపద్వితయము (అవయవద్వయముగల రూపము) నీకుఁ గలదు. భూతేశ్వరసుందరీ! వానియందు (ఆ రూపములు రెంటియందు) ఒకటి. జగత్తును భరించును. ఇంకొకటి మాత్రము విహరించును.

ప్రభ:- ''నీవు కారణ రూపమున జగత్తును భరింతువు, కార్యరూపమున విహరింతువు'' అని భావము.

మూ॥ శ్రోతుం స్తోత్ర విశేషం
భక్త విశేషం చ బోద్ధుమయ మీదృగితి,
దాతుం చ వాఞ్ఛితార్థం
తవమాతశ్చన్ద్ర లోకరూపం భవతి. 4

మాతా! అనేకములగు స్తోత్రములను వినుటకును, 'వీడు – ఇట్టి వాఁడు' అని యనేక భక్తులను యథాతథముగాఁ దెలిసికొనుటకును, అభీప్సితమగు వస్తువు నిచ్చుటకును, నీకు చంద్రలోకరూపము – కార్యరూపమగుచున్నది.

ప్రభ:- ఆధ్యాత్మముగా చంద్రలోకమనునది సహస్రారమనియే నిశ్చయింపఁదగును. కావున నిచట చంద్రలోక రూపమనఁగా; సహస్రారమేయగును. ''చారుయువతి రూపంభవతి'' అను పాఠాంతరము గలదు. అపుడు ''నీకు సుందరమగు స్త్రీ రూపము గలదు'' అని యర్థము నెఱుంగునది.

మూ॥ కీశకిశోరన్యాయాత్ కారణరూపం తవామ్బ యోగీధత్తే,
ఓతు కిశోరన్యాయాత్ భక్తం పరిపాసి కార్యరూపేణత్వమ్॥ 5

మర్కట కిశోరన్యాయము వలన నీకారణ రూపమును (మూల స్వరూపమును) యోగి ధరించుచుండును. మార్జాలకిశోర న్యాయము వలన, నీవు స్వీయమగు కార్యరూపము చేతగాని, (చంద్రలోక రూపము చేతఁగాని-సుందర స్త్రీరూపము చేతఁగాని) భక్తుని రక్షించుచుందువు.

ప్రభ:- మర్కట కిశోరమనఁగా; కోతిపిల్ల, అది స్వప్రయత్నమున తల్లిని గట్టిగాఁ బట్టుకొనియుండును. మార్జాలకిశోరమన – పిల్లి పిల్ల, అది తల్లిని పట్టుకొనదు. దాని తల్లియే తన పిల్లను బట్టుకొని త్రిప్పుచుండును. యోగి - స్వాత్మబలమున ఉమా స్వరూపమును గ్రహించును. భక్తుని భారము నాయమ్మయే వహించును. కావున యోగి – కోతి పిల్ల. భక్తుఁడు – పిల్లిపిల్ల.

విశే:- భక్తునికిని, యోగికిని, గల భేదమును నిరూపించుటకు ఇంద్రాణీ సప్తశతియందు గీతమగు మదలేఖావృత్తద్వయము నిచట నుదాహరింతును.

''గన్తవ్యం స్వరధీశే! నిశ్శేషార్పణశూరమ్
బిభ్రాణా నయ సిత్వం మార్జారీవకిశోరమ్.
గృహ్ణన్నమ్బరనాథా మమ్బామశ్లథబన్ధః
కీశస్యేవకిశోరో యోగీగచ్ఛతి గమ్యమ్''. (ఇది గణపతిముని రచితము)

మూ॥ దృఢధారణానచేత్ త్వచ్చ్యవతేయోగీ మహేశనయనజ్యోత్స్నె
నాయం మమేతిభావస్తవయదిసద్యః సవిత్రి! భక్తంత్యజసి॥ 6

మహేశ నయన జ్యోత్స్నవగు జననీ! దృఢమగు (ప్రమాదరహితమగు) ధారణలేని యెడల, యోగి – నీ నుండి (శక్తి స్వరూపము నుండి) భ్రష్టుఁడగును. 'వీఁడు నావాఁడు కాఁడు' అను భావము నీకుఁ గలిగిన యెడల నీవు వెంటనే భక్తుని త్యజించెదవు.

ప్రభ:- స్వబలావలంబియగు యోగికి స్వల్పమగు ప్రమాదము చేతఁగూడ (స్వరూప) భ్రంశము కలుగును, జననియగు ఉమాదేవికి సంపూర్ణముగా తన్నర్పించు కొనని భక్తుని– 'వీఁడు నావాఁడు కాఁ'డని యామె త్యజించును. ఆత్మార్పణశూరుఁడగు భక్తుని యెడల వీఁడు నావాఁడు కాఁడను భావ మాయమ్మకుఁ గలుగదు. అని తాత్పర్యము. యోగికి – ప్రమాదరహితమగు స్వశక్తి నవలంబించుటయు, భక్తునికి – సంపూర్ణమగు నాత్మార్పణమును, ముఖ్యమని భావము.

మూ॥ శిథిలధృతిర్యోగీస్యాద్
బాహ్యైర్విషయైర్నితాన్తమాకృష్టోయః
స్వీయమతిర్లుప్యతేతే
భక్తేఽహన్తాప్రసారకలుషే మాతః 7

మాతా! శిథిలమగు ధారణగల యోగి – శబ్దాదులగు బాహ్య విషయముల చేత మిగుల నాకర్షింపఁబడిన వాఁడగు చుండును. అహంకృతి ప్రసారము చేత (అహంభావవ్యాపనము చేత) అశుచియగు భక్తుని యెడల నీకు – స్వీయుఁడను (నావాఁడను) బుద్ధిలోపించును.

ప్రభ:- వెలుపల నున్న భోగ్య విషయములయం దాసక్తుఁడగు యోగికి దృఢమగు ధారణ కలుగదు. పూర్ణమగు ఆత్మ సమర్పణమే – భక్తికి లక్షణము. అహంత (నేనను తలంపు) కలుగునంతవరకును పూర్ణమగు నాత్మార్పణము జరుగదు. కావున అహంత (నేను, అనునది) భక్తిని లోపింపజేయును. అహంతను విడువని భక్తుని యందు, వీఁడు స్వీయుఁడను బుద్ధి నీకుఁ గలుగదు. కావున సంపూర్ణాత్మార్పణ రహితుఁడగు భక్తునకుఁ గూడ భ్రంశము తప్పదని భావము.

మూ॥ సాహఙ్కృతిర్నభక్తిః సబాహ్య విషయాధృతిర్న సర్వేశ్వరి! తే
అవిజానన్నావేతద్ భక్తోయోగీచనైవ సిద్ధాస్స్యాతామ్. 8

సర్వేశ్వరీ! అహంకృతితోఁ గూడినది – నీయందలి భక్తి కానేరదు. బాహ్య విషయములతోఁ గూడినది – నీయందగు ధారణకానేరదు. ఈ తత్త్వమును (సత్యమును) తెలియని భక్తుఁడును, యోగియు, సిద్ధులు కానేరరు.

ప్రభ:- అహంకారముతోఁగూడని భక్తియు, బాహ్య విషయములతో గూడని ధృతియు, భక్తుడును, యోగియు, గ్రహింప వలయును. అట్లు గ్రహింపని యెడల సిద్ధినొందరని భావము.

మూ॥ వ్యక్తిత్వా దపి యస్య
ప్రియం త్వదీయం సవిత్రి! పాదామ్భోజమ్।
సోఽద్భుతశక్తిర్భక్తో
భగవతి! కిం కిం కరోతి నాస్మిన్ జగతి॥ 9

ఓ సవిత్రీ! ఏ భక్తునకు వ్యక్తిత్వము (భిన్నమగు ఆత్మత్వము) కంటె నీయొక్క పాదారవిందము ప్రియమగునో, ఆ భక్తుఁడు – అద్భుత శక్తియై (ఆశ్చర్యకరములగు శక్తులు గలవాఁడై) యీ లోకమునందేది చేయుటకైనను శక్తుఁడగును.

ప్రభ:- 'నేను' అను తలంపును విడిచి 'నీ వేతక్క నితఃపరంబెఱుఁగ'' అని నీ పాదము నాశ్రయించిన భక్తుఁడు. – సర్వమును జేయుటకును, చేయకుండుటకును, వేఱొక విధముగాఁ జేయుటకును సామర్థ్యము గలవాఁడగునని భావము.

మూ॥ వ్యక్తిత్వలోభవివశో
సిద్ధఃకామోఽపిభవతి సమవచ్ఛిన్నః।
ప్రాప్తోఽపి సలిలరాశిం
సలిలాని ఘటఃకియ న్తిసఙ్గృహ్ణీయాత్. 10

వ్యక్తిత్వలోభ వివశుఁడగు (తాను లోకులందఱి కంటెను గూడ భిన్నుఁడగుట యందగు అభిలాషమున పరాధీనుఁడగు) మనుజునకు మనోరథము సిద్ధించినను గూడ – అది సర్వవిధముల చేతను పరిమితమే యగును. అల్పమగు ఘటము– జలరాశియగు సముద్రమునందు ప్రవేశించిన గూడ నెన్ని నీళ్ళు గ్రహించును?

ప్రభ:- సర్వమనోరథ సిద్ధులకును నిధియగు దేవీ ప్రసాదమును బొందియుఁగూడ, అహం కారలోభియగు మనుష్యునకు ఒకానొక మనోరథము (కామవిశేషము) సిద్ధించినను, అది యవచ్ఛిన్నమగుట వలన స్వల్పమేయగును. అహంకారలోభి కాని జనుడే – పరిచ్ఛేద రహితమగు (అఖణ్డమగు) దేవీ ప్రసాద మహాత్మ్య వైభవమును, గ్రహించును.

తాభ్యాం తౌయది చుస్యాతామవనజ్ఞాలఙ్కృతిస్తుసా।
అను చంద్రాలోక లక్షణము వలన నిది యవజ్ఞాలంకారమగును.

మూ॥ జీవన్నేవనరోయః
సాయుజ్యం తే ప్రయాతి శమ్భోః ప్రమదే!
సర్వేకామాస్తస్య
ప్రయాన్తి వశమాశు వీతవివిధభ్రాన్తేః 11

శంభు ప్రమదవగు జననీ! జీవించుచున్నప్పుడే నీ సాయుజ్యము నొంది (జీవన్ముక్తుఁడై) నానా ప్రకారమగు భ్రాంతిని (మిథ్యాధ్యవసితిని) విడిచిన తత్త్వవేత్తకు – కోరికలన్నియుఁగూడ – శీఘ్రముగా వశపడును.

ప్రభ:- భవత్సాయుజ్య సంపన్నుఁడగు జీవన్ముక్తుఁనకు, సర్వకామవశిత్వము సిద్ధించునని భావము.

ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశన్తియద్వత్
తద్వత్ కామా యం ప్రవిశన్తి సర్వే
సశాన్తి మాప్నోతి న కామ కామీ॥

అని యీ యంశము గీతయందు స్మరింపఁబడుచున్నది గదా!

మూ॥ వ్యక్తిత్వం తుభ్య మిదం
మనీషయామే ప్రదత్త మధికారిణ్యా
బహుకాల భోగబలతో
వివదతి దేహో మదమ్బ! కింకరవాణి! 12

నా తల్లీ! అధికారిణియగు (యోగ్యత గలదియగు) నా బుద్ధి మదీయమగు నీ వ్యక్తిత్వము (పృథగాత్మత్వము) నీకు సమర్పింపఁబడినది. పాంచ భౌతిక పిండమగు ఈ దేహము మాత్రము – బహుకాలభోగాభ్యాస బలము వలన

వివదించుచున్నది. (వ్యక్తిత్వం నర్పింపఁజేయుట కంగీకరింపకున్నది) నేనేమి చేయుదును?

ప్రభ:- నా బుద్ధి – ఒకానొక (జ్ఞాన) సంస్కారము వలన ఒకానొక బలము నార్జించి – వ్యక్తిత్వార్పణము నందధికారము గలదైయున్నది. ఇట్టి యోగ్యత (అధికారము) గల యీ నా బుద్ధి – తన వ్యక్తిత్వమును (భిన్న భావమును) నీకు సమర్పించుచున్నను, స్థూలమగు నా శరీరము – దానిననువర్తింపకున్నది. దీనికి నేనేమి చేయగలను' నీవే శరణమని భావము.

మూ॥ స్థూలేన వర్ష్మణాసహ
సూక్ష్మా కలహం మతిర్నకర్తుం శక్తా!
సుతరాం బలవతి! మాత
ర్బలాద్ గృహాణ స్వయం త్వ మస్మాత్ స్వీయమ్ 13

స్థూలమగు శరీరముతోఁ గలహించుటకు సూక్ష్మమగు బుద్ధి – సమర్థము కాకున్నది. తల్లీ! మిక్కిలి బలాఢ్యవగు నీవు – త్వదీయమును, శరీరగతమును, అగు వ్యక్తిత్వమును దీని నుండి (నాయందు నుండి) బలాత్కారముగా గ్రహింపుము.

ప్రభ:- నేను వ్యక్తిత్వమును నీకర్పించితిని. కావున నా బుద్ధి – నీయధీనము చేయఁబడినది. ఈ శరీరము మాత్రము వ్యక్తిత్వార్పణమును సహింపకున్నది. కావున శరీర గతమగు మదీయ వ్యక్తిత్వమును బలాత్కరించి, గ్రహించి, కృపఁజూపుమని భావము.

మూ॥ సర్వేషాం హృదయస్మాత్
త్వమసి ప్రాణాత్మికాఽమ్బ హేతోస్తస్మాత్
అఖిల ప్రాణ్యారాధన
మారాధన నిర్విశేష మగపుత్రి! తవ 14

అమ్మా! పార్వతీ! సర్వప్రాణి హృదయములందును గూడ నీవు ప్రాణాత్మికవై (ప్రాణ-స్వరూపిణివై) యున్నావు. కావున ప్రాణులనందఱిని సమారాధించుట - నిన్నారాధించుటకంటె వేఱుకాదు.

ప్రభ:- అఖిల భూతములందును నీవు ప్రాణ స్వరూపముతో నున్నావు. కావున సర్వప్రాణీ ప్రీణనము - త్వదారాధనమే యగును. ఇందు సంశయము లేదు.

మూ॥ జుహ్వతికేఽపికృశానౌ
తస్మాత్ ప్రాప్తిస్తవేతి సమ్పశ్యన్తః
అపరే ప్రాణిషు జుహ్వతి
సాక్షాత్ ప్రాణాత్మికాఽసితేష్వన్తరితి. 15

హోమద్రవ్యము నిన్నుబొందునను తలంపున మనుష్యులు కొందఱు - అగ్నియందు హవనము చేయుదురు. మఱికొందఱు - ప్రాణుల లోపల నీవు ప్రాణ స్వరూపిణివై యుందువను తలంపున ప్రాణులయందు (ప్రాణము గల వారి యందు) హవనము (హోమము) చేయుదురు.

ప్రభ:- ఇందు రెండవది. ప్రాణములే అగ్నియను తలంపునఁ జేయబడిన హోమము. కావున నిదియొక ప్రాణాగ్ని హోత్రమగుచున్నది.

మూ॥ ప్రాణోష్వపియః ప్రాణం
భూతాదిమనాది మాత్మ నిష్ఠిత మనఘమ్।
సతతముపాస్తే యోగీ
తస్మిన్ హోమేన తేఽమ్బ తృప్తిస్సులభా॥ 16

అమ్మా! భూతములకు కారణమును, అనాదియు (కారణము లేనిదియు) ఆత్మయందున్నదియు, పవిత్రమును, (నిర్లేపమును) ప్రాణులయందున్నదియు, నగు ప్రాణమును- నిరంతరముగా నుపాసించుచున్న యోగియందు గూడ, ప్రాణోపాస్తి రూపమగు హోమము చేత- నీకు తృప్తి సులభమగును.

మూ॥ ఆత్మ నియోఽమ్బ శ్రేష్ఠే
ప్రాణే ప్రాణాన్ జుహోతి దహరాభిముఖః
త్వ ద్రూపే హతపాపే
తేన జితం సకలమీశచిత్తారామే! 17

ఈశ్వర హృదయో పవనము నందు విహరించుచున్న తల్లీ! ఎవఁడు దహరాభిముఖుఁడై (హృదయాకాశాభిముఖుఁడై) నీకు స్వరూపమును, అపహతపాపమును, స్వాత్మయు, అగు ముఖ్య ప్రాణమునందు ప్రాణములను హోమము చేయుచుండునో, (పుణ్యాత్ముఁడగు) వాఁడు సకలమును జయించును.

మూ॥ ఉపసంహృత మఖిలేభ్యో
విషయేభ్యో నిర్నిమేషమన్తః కృష్టమ్
హృదిదృఢపదేనచక్షు
స్త్వద్రూపే హూయతే మదమ్బ! ప్రాణే. 18

నా తల్లీ! బాహ్యములగు విషయములన్నింటి నుండియు (అన్ని రూపముల నుండియు) ఉపసంహరింపఁబడినదియు, నిమీలనము లేనిదియు, అంతర్ముఖమయినదియు, (లోనికి త్రిప్పఁబడినదియు) అగు నేత్రము - హృదయము నందు దృఢమగు (స్థిరమగు) స్థానము గలయోగిచేత నీ స్వరూపమగు ప్రాణమునందు హోమము చేయఁబడును.

ప్రభ:- హృదయమున స్థితి నొందిన (హృదయ నిష్ఠుఁడగు) యోగి - ధాన్యమును (నిర్విషయమును) నిమేషవర్జమును, అగు అంతర్ముఖదర్శనమును- ప్రాణమునందు హోమము చేయుచున్నాఁడు. ఇది - దహర (హృదయ) నిష్ఠని ప్రాణాగ్నిహోత్రము.

మూ॥ అన్తస్స్వరం నిగూఢం
శ్రేష్ఠప్రాణస్య దేవి! తవభాగస్య।
శృణ్వాదివ ప్రణవాఖ్యం
శ్రవణం తత్రైవ భవతి జగదమ్బ! హుతమ్॥ 19

జగదంబా! శ్రోత్రేంద్రియము - నీయంశమగు (భాగమగు) శ్రేష్ఠప్రాణము యొక్క నిగూఢమును, ప్రణవాఖ్యమును, అగు అంతర నాదమును (అనాహత నాదమును) వినుచున్నది వలె నున్నది. ఆ ముఖ్య ప్రాణము యొక్క అంతరనాదమునందే (యీ) జగత్తు - హోమము చేయఁబడిన దగుచున్నది.

ప్రభ:- జగద్విషయకమగు వృత్తియంతయుఁగూడ - శబ్ద రూపమున (ప్రాణము) లోపల నుండుట వలనను, సర్వ శబ్దములకును మూలప్రకృతియు, ప్రణవాఖ్యమును అగుచు, ప్రాణములోనున్న ఓంకార నాదమునందు జగత్తు హోమము చేయబడునని భావము.

మూ॥ సర్వేషాం మన్త్రాణాం
స్తోత్రాణాంచేశ చిత్తనాధే ప్రకృతౌ
గూఢం సదా స్వరన్త్యాం
ప్రాణన్త్యాం త్వయి జుహోతి మౌనీవాచమ్. 20

శివహృదయేశ్వరీ! సర్వమంత్రములకును, సర్వస్తోత్రములకును, గూఢ ప్రకృతివియు (మూల స్వరూపభూతవును) గుప్తముగా ధ్వనించుదానవును, (నాదము నొనర్చుదానవును) ప్రాణనము (శ్వాసము) నొనర్చుదానవును, అగు నీయందు- శాంతి సంపన్నుఁడగు మౌని- వాక్కును హోమము చేయును.

ప్రభ:- వాక్కులకన్నింటికిని మూల స్వరూపమగు ప్రాణోద్గీథమునందే వాక్కులన్నియు నుపసంహరింపఁబడునని భావము. దీనిని మంత్రోద్గీథోపాసనమని చెప్పుదురు.

మూ॥ దేహే స్ఖలతి మనశ్చేత్
విషయేషు హుతం దధాతి విషయాత్మత్వమ్।
ఆవృత్తం యది దేహాత్
సూక్ష్మాయాం త్వయి హుతంత్వదాకృతి భవతి. 21

మనస్సులోపలి నుండి చ్యుతమై మనస్సు శరీరగతమగు నెడల శబ్దరూపాది విషయముల యందు హుతమై విషయరూపతను ధరించును. దేహము నుండి మరలి అంతర్ముఖయైన యెడల, అదియే- సూక్ష్మస్వరూపిణి వగు నీ యందు హుతమై- త్వద్రూపమగును.

ప్రభ:- మనస్సు శబ్దాదులయందు హోమము చేయఁబడుటయనఁగా లోనున్న మనస్సు వెలికి వచ్చి శబ్దాదులను స్వీకరించుటయే యగును. ఏది దేవి యందు హుతమగునో అది దాని రూపము నొందును. కావున మనస్సు వెలికివచ్చినపుడు శబ్దాది విషయరూపమును ధరించును. ఆ మనస్సును బహిర్వ్యాపారముల నుండి మరలించిన యెడల అది లోచూపు గలదగును. అంతర్దృష్టియగు మనస్సును నీయందు లయింపఁజేయుటయే హుతము చేయుటయగును. అట్లు హుతమైన (లయించిన) మనస్సు - నీ రూపము వంటి రూపము గలదగును.

బహిర్ విషయములయందు ప్రసరించిన మనస్సు - విషయరూపమగును. అంతర్గతమైన (నీయందు ప్రవేశించిన) మనస్సు - భవద్రూపమగును. అని భావము.

మూ॥ త్వగ్రసనఘ్రాణానా
మనుభూతీః ప్రాణశక్తి సాత్ కుర్వాణః।
కం నార్పయతే భోగం
భగవతి తే సర్వలోకపార్థివ వనితే. 22

సర్వలోకేశ్వర కాంతవగు భగవతీ! స్పర్శేంద్రియ - జిహ్వేంద్రియ - గంధేంద్రియముల యనుభూతులను, ప్రాణ శక్త్యధీనము నొనర్చుయోగి - ఏ భోగమును నీకర్పింపకుండును?

ప్రభ:- అనుభవము లన్నింటిని కూడ - ఆధారభూతమగు ప్రకృతి - ప్రాణ శక్తియే యగును. కావున ననుభూతు లన్నియును ప్రాణాధీనములుగాఁ జేయబఁడుచున్నవి. ప్రాణశక్తి - నీ స్వరూపమే యగుచున్నది. కావున యోగి - నీయందే సర్వభోగ సమర్పణము నొనర్చునని భావము.

మూ॥ గచ్ఛన్ కుర్వన్ విసృజన్
రమమాణశ్చాప్మ్బ! సకలలోకాధీశే!
యః కేవలాం క్రియామపి।
చిన్తయతే తేన నిత్యయజ్ఞః క్రియతే. 23

సర్వలోకేశ్వరీ! నడుచుచు, పనిచేయుచు, విడుచుచు, రమించుచు, కేవలము క్రియనే ధ్యానించు పురుషుఁడు - నిత్య యజ్ఞము నొనర్చుచున్నాఁడు.

ప్రభ:- పాదములతో నడుచుచు, చేతితో కర్మల నొనర్చుచు, పాయువు చేత అశుచి పదార్థములను విడుచుచు, సురతమునందు ప్రవర్తించుచు - ఈ యింద్రియ వ్యాపారములన్నింటి యందును క్రియా సామాన్యమును మాత్రమే ధ్యానించు పురుషుఁడు - నిత్య యజ్ఞము నొనర్చుచున్నాఁడు. వాని జీవనమే యజనమగుచున్నది. కావున వాఁడు నిత్యయాజి - యగుచున్నాఁడు.

మూ॥ సర్వేషా మగ్నీనాం
ప్రాణాగ్నిస్తవ విభూతిరుక్తః శ్రేష్ఠః
తస్మిన్ హుతంతు సుహుతం
ద్రవ్యాణి, ధియః క్రియాశ్చ, మన్త్రః, ప్రణవః॥ 24

అగ్నులన్నింటిలోపలను (శ్రౌతములు స్మార్తములు అగు అగ్నుల లోపలగాని, భౌతిక - వైద్యుత - సౌరాగ్నులలోపలఁగాని) నీవిభూతి (కళ) యగు ప్రాణాగ్ని - శ్రేష్ఠముగాఁ జెప్పఁబడినది. ఆ ప్రాణాగ్నియందు (ముఖ్య ప్రాణమునందు) హోమము చేయఁబడినది మాత్రమే చక్కగా హోమము చేయఁబడిన దగుచున్నది. ఈయజ్ఞమునందు - బుద్ధులును, క్రియలును - హోమద్రవ్యములు. లోపల ధ్వనించుచు, ఉద్గీథమనునామమునఁ జెప్పఁబడుచున్న ప్రణవము - మంత్రము.

మూ॥ ఆర్యాగీతీనామయ
మధరీకృత మధుసుధాధిమాధుర్యరసః।
వర్గోగణపతి వదనా
న్నిష్క్రాన్తోభవతు శర్వసుదృశః ప్రీత్యై॥ 25

గణపతికవి ముఖము నుండి బయలు వెడలినదియు, మధు - సుధా - ద్రాక్షాదుల వూధుర్య రసమును క్రిందుపరచునదియు, అగు, ఈ యార్యాగీతిగణము - శర్వాణికి ప్రీతినిడుఁగాత!

ఇతి - శ్రీ మహర్షి రమణభగవత్ పాదాన్తే వాసినో
వాసిష్ఠస్య నరసింహసూనోః గణపతిమునేః కృతా
వుమాసహస్రే ద్వాత్రింశః స్తబకః సమాప్తః॥
సమాప్తంచ - అష్టమశతకమ్.

ఇది శ్రీ మహర్షి - రమణ భగవత్ పాద శిష్యుఁడు, శఠమర్షణ
సగోత్రుఁడు
శ్రీ మత్స్యంతుల పేరయ శాస్త్రి పౌత్రుఁడు, వేంకటరామ
బుధేంద్రపుత్రుఁడు, శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన ఉమా సహస్రమను స్తోత్ర
కావ్యమున ముప్పది రెండవ స్తబకము
(8 వ శతకము)

****

ఓం నమోభగవతే శ్రీరమణాయ, శ్రీ భారతీదేవ్యైనమః

ఉమాసహస్రము

(తొమ్మిదవ శతకము - ప్రథమ స్తబకము)

త్రయస్త్రింశ స్తబకము

మూ॥ సుధాంకిరన్తోఽఖిలతాపహారిణీం
తమోహరన్తోపటలేన రోచిషామ్
శ్రియం దిశన్తోదిశిదిశ్య సజ్జయాం
జయన్తిశీతాద్రిసుతాస్మితాఙ్కురాః॥ 1

అఖిల తాపహారిణి (తాపత్రయమును) శమింపఁజేయునది, లేక (వేడిని పోగొట్టునది) యగు సుధను ప్రసరించునవియు, తేజస్సమూహము చేత తమమును (వెలుపలనున్న చీకటిని, లేక అంతరమగు అజ్ఞానమును,) నివారించునవియు, సర్వదిక్కులయందును నశింపని శ్రీని (శోభను, లేక సంపదను) ప్రదర్శించునవియు, అగు శీతాచలకుమారి యొక్క స్మితాంకురములు - జయించుచున్నవి.

ప్రభః- ఇందు సుధా - తమః - శ్రీ పదముల యందు శ్లేషగలదు. దానిచేత స్మితాంకుర శబ్దార్థ సామర్థ్యము వలన పార్వతీవదనము - చంద్రుఁడను నర్థ మాక్షేపింపఁబడుచున్నది. కావున నిది శ్లిష్టమగు రూపకాలంకారమగుచున్నది.

మూ॥ కృపాకటాక్షస్తవ కేనవాఽప్యతే
మహేశశుద్ధాన్తపురన్ధ్రి! కర్మణా॥
నిరన్తరం మన్త్రజపేనవామతే
ర్విశోధనే నోత మనోర్పణేనవా॥ 2